RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధ వారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:73 | ఫిబ్రవరి 25, 2026 | వెల: రూ.3-00



ఒకే కుటుంబానికి చెందిన

## ముగ్గురు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణమా? పోలీసుల అనుమానం
- తల్లిదండ్రులతో పాటు కుమారుడు సైతం..
- ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు
- అంబర్‌పేటలో విషాదం


హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పేరుతో

## అమాయకులకు వల

బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి

హన్మకొండలోని ఓ క్లినిక్ బాగోతం

# బట్టతలపై జుట్టు మొలిపిస్తామని..!




## ఆఫర్ల పేరిట వేలకు వేలు గుంజుతున్న వైనం

- ఓ వ్యక్తి నుంచి రూ.30వేలు తీసుకున్నా ఇవ్వని ట్రీట్మెంట్
- పోలీసులకు ఫిర్యాదు చేసినా దక్కని న్యాయం
- తాజాగా పేరు మార్పు చేసి మోసం చేసేందుకు ప్రజల ముందుకు
- డాక్టర్ విద్యార్హతలపై కూడా అనుమానం
- ఫేక్ క్లినిక్ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

2లో

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

జుట్టు రాలుతుందనో, బట్టతల వస్తుందనో ఆందోళన చెందుతున్న వారి ఆశలే పెట్టుబడిగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ముఠాలు 'హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్' పేరుతో భారీ దందాకు తెరలేపాయి. సోషల్ మీడియాలో రంగురంగుల ప్రకటనలు, అదిరిపోయే ఆఫర్లతో అమాయక యువతను ఆకర్షించి, చివరకు వారిని అటు ఆర్థికంగా, ఇటు మానసికంగా దెబ్బతీస్తున్నాయి. హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్లాజాలో నిర్వహిస్తున్న హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్ వ్యవహారం ఇప్పుడు ఈ దందాను బట్టబయలు చేసింది. తక్కువ ధరకే చికిత్స చేస్తామంటూ బాధితుల నుంచి రూ. 30 వేల వరకు వసూలు చేసి, సంవత్సరాల తరబడి స్లాట్ బుక్ చేయకుండా, ట్రీట్మెంట్ ఇవ్వకుండా వేధిస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది. తీరా తమకు జరగాల్సిన ట్రీట్మెంట్ గురించి నిలదీస్తే, క్లినిక్ నిర్వాహకులు బాధితులపైనే భౌతిక దాడులకు, దుర్భాషలాడటానికి దిగుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేసినా న్యాయం దక్కకపోడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.. ఇలాంటి వారిని నమ్మొద్దని చెబుతున్నాడు.

## దేవుడి భూమి మాయం చేసిందెవరు?

- 4 ఎకరాల రాజరాజేశ్వర స్వామి భూమి ఎక్కడికి వెళ్లింది?
- మూడేళ్ల తర్వాత చర్చ

## రైతు భరోసా ఇంకెప్పుడు..?

త్వరగా నిధులు విడుదల చేయాలని కోరుతున్న రైతులు

## గురుకుల హాస్టల్లో క్షుద్రపూజల కలకలం



- గూడూరు గిరిజన బాలికల వసతి గృహంలో ఉద్రిక్తత
- సరైన భోజనం, వసతులు లేవని విద్యార్థినుల ఆగ్రహం
- ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా

2లో



డీజీపీ ఎదుట లొంగిపోయిన

## మావోయిస్టు అగ్రనేతలు

జనజీవన స్రవంతిలోకి దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు, గంగన్న

- రెండేళ్లలో 591 మంది లొంగుబాటు
- నగదు బహుమతులు, పునరావాస ప్రయోజనాలు అతి త్వరలో అందిస్తాం
- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి

2లో

కొబ్బరి బోండాలకు అనుమతులు లేవు..

# మందు బాటిళ్లు ప్రత్యక్షం!

- నిబంధనలు కేవలం బోర్డులకేనా?
- ప్రమాదకరంగా మారిన బయో మెడికల్ వ్యర్థాలు
- ఇదీ షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి తీరు

**వేద న్యూస్, షాద్‌నగర్**

ప్రాణదానం చేయాల్సిన ప్రభుత్వ ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోగాలకు నిలయంగా మారుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. షాద్‌నగర్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్యం పూర్తిగా దెబ్బతిన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల పేరుతో సామాన్యులను కట్టడి చేస్తున్న అధికారులు, ఆసుపత్రి లోపల జరుగుతున్న అవకతవకలను మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి లోపలికి కొబ్బరి బోండాలు తీసుకురావద్దని పెద్ద ఎత్తున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన యాజమాన్యం, అదే ఆసుపత్రి రెండో అంతస్తులో కనిపించిన మద్యం సీసాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రోగులు కోలుకునేందుకు తాగే కొబ్బరినీళ్లపై ఉన్న నిబంధనలు, మద్యం బాటిళ్ల విషయంలో వర్తించవా? అని పౌరులు మండిపడుతున్నారు.





### ప్రమాదకరంగా బయో మెడికల్ వ్యర్థాలు

ఆసుపత్రి ప్రాంగణంలో వాడిన ఇంజక్షన్ సూదులు, సిరంజీలు, మెడికల్ వ్యర్థాలు పలుచోట్ల కుప్పలుగా కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం బయో మెడికల్ వ్యర్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేయాల్సి ఉన్నప్పటికీ, అవి బహిరంగంగా పడేయడం వల్ల రోగులకు, చిన్నారులకు ఇన్ఫెక్షన్ల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

### బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆసుపత్రిలో మద్యం సీసాలు ఎలా చేరాయి? భద్రతా సిబ్బంది ఏమి చేస్తున్నారు? పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం ఎందుకు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# దేవుడి భూమి మాయం చేసిందెవరు?

- 4 ఎకరాల రాజరాజేశ్వర స్వామి భూమి ఎక్కడికి వెళ్లింది?
- మూడేళ్ల తర్వాత చర్చ

**వేద న్యూస్, హన్మకొండ**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ భూసేకరణలో రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి చెందిన నాలుగు ఎకరాల భూమి గల్లంతైనట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొదటి విడత భూసేకరణ రికార్డుల్లో దేవాలయ భూమి నమోదై ఉన్నప్పటికీ, రెండో విడత లబ్ధిదారుల జాబితా నాటికి ఆ భూమి రికార్డుల్లో కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. వంగర గ్రామస్థులు పలు సార్లు ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదులు చేయడంతో పాటు నిరసనలు కూడా చేపట్టినప్పటికీ, రికార్డుల్లో భూమి లేదు అంటూ అధికారులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. అయితే, భూసేకరణ ప్రక్రియ ప్రారంభమై మూడు సంవత్సరాల అనంతరం ల్యాండ్ అక్విజిషన్ అధికారికి సంబంధించిన ఓ వీడియో వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. ఆ వీడియోలో దేవుడి పేరుతో భూమి ఉన్నట్లు, దానికి సంబంధించిన నష్టపరిహారం ఎక్కడికి వెళ్తుందనే అంశంపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో అప్పటి ఎమ్మార్వో, ఆర్డీవో పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవాలయ భూమి విషయంలో నిర్లక్ష్యం జరిగిందా? లేక ఉద్దేశపూర్వకంగా మార్పులు చేశారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దేవుడి భూమి వ్యవహారం పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు బయట పెట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు

# రైతు భరోసా ఇంకెప్పుడు..?

**త్వరగా నిధులు విడుదల చేయాలని కోరుతున్న రైతులు.**



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో రైతు భరోసా నిధుల కోసం రైతాంగం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. యాసంగి సీజన్‌కు ఎకరానికి రూ.6వేల చొప్పున అందించాల్సిన రైతు భరోసాపై ఇప్పటివరకు స్పష్టత రాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు రైతు భరోసా అమలు గురించి ప్రకటనలు చేసినప్పటికీ, రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదని వారు పేర్కొంటున్నారు. జనవరి తొలి వారం, సంక్రాంతి, నెలాఖరు, మున్సిపల్ ఎన్నికల అనంతరం అంటూ పలు తేదీలు వినిపించినా అమలుపై స్పష్టమైన ప్రకటన రాలేదని రైతులు అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రైతులు నిరసనలు, ధర్నాలు చేపడుతూ ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూడా రైతు భరోసా అంశంపై చర్చ జరిగిందా లేదా అన్నది స్పష్టంగా తెలియరాలేదని సమాచారం. రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని రైతాంగం కోరుతోంది.

# మార్చి 16 నుంచి బడ్జెట్ సమావేశాలు

- మంత్రివర్గం నిర్ణయించిన షెడ్యూల్
- తొలి రోజు గవర్నర్ ప్రసంగం
- మార్చి 20న ప్రవేశపెట్టనున్న బడ్జెట్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. సమావేశాల తొలి రోజైన మార్చి 16న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, రాబోయే ఏడాదికి సంబంధించిన కార్యాచరణపై గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం మార్చి 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో చర్చ జరుగుతుంది. మార్చి 20వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయం–వ్యయ అంచనాలు, సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు బడ్జెట్‌లో ప్రాధాన్యం పొందనున్నాయి. మార్చి 30 వరకు జరిగే ఈ సమావేశాల్లో బడ్జెట్‌పై విస్తృత చర్చలు, శాఖల వారీగా డిమాండ్లపై చర్చ, ఆమోద ప్రక్రియ జరగనుంది. రాష్ట్ర రాజకీయాల్లో బడ్జెట్ సమావేశాలు కీలకంగా మారనున్నాయి.



# బట్టతలపై.. జుట్టు మొలిపిస్తామని!

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

అందమైన జుట్టు కోసం ఆశపడే వారి బలహీనతను ఆసరాగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా కొన్ని క్లినిక్లు నిలువునా దోచుకుంటున్నాయి. హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్లాజాలో నిర్వహిస్తున్న హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ క్లినిక్ అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. తక్కువ ధరకే ట్రీట్మెంట్ చేస్తామని నమ్మించి, వేల రూపాయలు వసూలు చేసి, తీరా పని దగ్గరకు వచ్చేసరికి క్లయింట్లపైనే దౌర్జన్యానికి దిగుతున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.

## ఆఫర్ల పేరిట రూ. 30 వేలు కాజేశారు!

క్లినిక్‌లో పని చేసే ఓ ఉద్యోగిని గత రెండు సంవత్సరాల నుంచి ఒక వ్యక్తిని ఫోన్లో ఫాలో అప్ చేస్తూ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఒత్తిడి తెచ్చింది. జీఎస్‌టీతో కలిపి కేవలం రూ. 30వేలు ఆఫర్ ఉందని నమ్మించడంతో బాధితుడు గతేడాది అక్టోబర్ 15న ఆ మొత్తాన్ని చెల్లించాడు. ఆ తర్వాత క్లినిక్ సూచించిన డయాగ్నస్టిక్ సెంటర్‌లో మరో రూ. 2,800 వెచ్చించి పరీక్షలు కూడా చేయించుకున్నాడు. అయితే డబ్బులు కట్టినప్పటి నుంచి నేటి వరకు ట్రీట్మెంట్ కోసం స్లాట్ బుక్ చేయకుండా క్లినిక్ నిర్వాహకులు బాధితుడిని నానా ఇబ్బందులకు గురిచేస్తూ కాలయాపన చేస్తున్నారని బాధితుడు ఆరోపిస్తున్నారు.

## ప్రశ్నిస్తే దౌర్జన్యం.. బెదిరింపులు

తనకు జరగాల్సిన ట్రీట్మెంట్ గురించి అడిగిన బాధితుడిపై క్లినిక్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. తమకు 300 మంది క్లయింట్ల చరిత్ర ఉందని డాక్టర్ చెప్పగా, కనీసం పది మంది సక్సెస్ డేటా చూపమని అడిగినందుకు బాధితుడిపై దుర్భాషలాడారు. తాజాగా ఈ క్లినిక్ పేరును మార్చినట్లు చెబుతూ, పాత క్లయింట్లకు ఒక్క రూపాయి కూడా రిఫండ్ ఇవ్వబోమని హైదరాబాద్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ ను చులకన చేస్తూ మాట్లాడటం వారి అహంకారానికి నిదర్శనం. 'మేము రిఫండ్ ఇవ్వం, ఏం చేసుకుంటారో చేసుకోండి' అంటూ ఆమె




దౌర్జన్యంగా మాట్లాడారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## పోలీసులకే ఎదురుప్రశ్నలు..

ఈ మోసంపై బాధితుడు ఫిబ్రవరి 7న సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణకు రావాలని ఎస్సై ఫోన్ చేసినా క్లినిక్ సిబ్బంది బరితెగింపుగా సమాధానమిచ్చారు. 'మహిళలు పోలీస్ స్టేషన్‌కు వస్తారా?' అని ఎస్సైని ఎదురు ప్రశ్న వేయడమే కాకుండా, ఏ పోలీస్ అధికారి మమ్మల్ని ఏం చేయలేరని, కావాలంటే కన్స్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేసుకోమని సవాల్ విసిరారు. డాక్టర్ విద్యార్హతలపై కూడా బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి ఫిర్యాదు చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా పుట్టగొడుగుల్లా..

రాష్ట్రవ్యాప్తంగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ అమాయక ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని అక్రమ వ్యాపారానికి తెరలేపాయి. సరైన అర్హత లేని వైద్యులు, కనీస వైద్య ప్రమాణాలు పాటించని క్లినిక్‌లు తక్కువ ధరకే జుట్టు మొలిపిస్తామంటూ సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ప్రకటనలతో యువతను బుట్టలో వేసుకుంటున్నాయి. ఒకసారి డబ్బులు కట్టిన తర్వాత స్లాట్ ఇవ్వకుండా వేధించడం, చికిత్స పేరుతో ఇన్ఫెక్షన్లకు కారణం కావడమే కాకుండా, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగడం నిత్యకృత్యమైంది. నిబంధనలను తుంగలో తొక్కి, పేర్లు మారుస్తూ బోర్డులు తిప్పుతున్న ఇటువంటి ఫేక్ సెంటర్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు తక్షణమే స్పందించి విచారణ చేపట్టి వీటిపై ఉక్కుపాదం మోపాలని బాధితులు కోరుతున్నారు.

### హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పేరుతో అమాయకులకు వల

- బాధితుడి ఫిర్యాదుతో వెలుగులోకి క్లినిక్ బాగోతం
- ఆఫర్ల పేరిట వేలకు వేలు గుంజుతున్న వైనం
- ఓ వ్యక్తి నుంచి రూ.30వేలు తీసుకున్నా ఇవ్వని ట్రీట్మెంట్
- పోలీసులకు ఫిర్యాదు చేసినా దక్కని న్యాయం
- తాజాగా పేరు మార్పు చేసి మోసం చేసేందుకు ప్రజల ముందుకు
- డాక్టర్ విద్యార్హతలపై కూడా అనుమానం
- ఫేక్ క్లినిక్ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

### పేరు మార్చి మరో దోపిడీకి సిద్ధం!

**గతంలో ఓ పేరుతో మోసాలకు పాల్పడిన వారే ఇప్పుడు మరో పేరుతో సోషల్ మీడియాలో స్టేటస్‌లు పెడుతూ మళ్ళీ అమాయక ప్రజలను బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి అనుమతులు లేని, దౌర్జన్యాలు చేసే క్లినిక్లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నాడు.**



| Description | No. of Sessions | Package Amount |
|---|---|---|
| 1. Hair Transplant | 1 | 29,999/- |
| 2. | | |
| 3. | | |
| Total Amount for the Package | | |
| GST @ 18% | | |
| Less Amount Received | | 29999/- |
| Balance Due | | Nil |
| Rs. in Words : | | |

# డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు

**జనజీవన స్రవంతిలోకి దేవ్‌జీ, రాజిరెడ్డి, బడే చొక్కారావు, గంగన్న**

- రెండేళ్లలో 591 మంది లొంగుబాటు
- నగదు బహుమతులు, పునరావాస ప్రయోజనాలు అతి త్వరలో అందిస్తాం
- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మంగళవారం తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, బడే చొక్కారావు అలియాస్ దామోదర్, నూనె నర్సింహారెడ్డి అలియాస్ గంగన్న కూడా లొంగుబాటు చేసినట్లు డీజీపీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత రెండేళ్లలో నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 26 మంది డివిజన్ కమిటీ సభ్యులు, 85 మంది ఏరియా కమిటీ సెక్రటరీలు, 60 మంది పార్టీ సభ్యులు సహా మొత్తం 591 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చారని తెలిపారు. తెలంగాణలో పుట్టి పెరిగిన మరో 11 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో కొందరితో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులు, పునరావాస ప్రయోజనాలు వెంటనే అందిస్తామని అధికారులు స్పష్టం చేశారు. కేంద్ర కమిటీ సభ్యులైన దేవ్‌జీ, సంగ్రామ్‌లకు రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి, రాష్ట్ర కమిటీ సభ్యులైన దామోదర్, గంగన్నలకు రూ.20 లక్షల చొప్పున అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర, కేంద్ర పునరావాస పథకాల ప్రకారం వారికి మొత్తం రూ.90 లక్షల వరకు లభించే అవకాశం ఉందని వెల్లడించారు. లొంగుబాటులో కీలక పాత్ర పోషించిన ప్రత్యేక నిఘా విభాగ అధికారులను డీజీపీ అభినందించారు. ప్రధాన ప్రవాహంలోకి వచ్చిన మావోయిస్టుల హక్కులను కాపాడుతామని, వారి భద్రతకు పూర్తి హామీ ఇస్తామని స్పష్టం చేశారు. హింస మార్గం విడిచి సాధారణ జీవన విధానాన్ని ఎంచుకోవడం సానుకూల పరిణామమని డీజీపీ వ్యాఖ్యానించారు.

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణమా? పోలీసుల అనుమానం
- తల్లిదండ్రులతో పాటు కుమారుడు సైతం..
- ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు
- అంబర్‌పేటలో విషాదం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంబర్‌పేట బాపునగర్ కాకతీయ వీధిలో నివసిస్తున్న రామ్‌రాజ్ (55), ఆయన భార్య మాధవి (50), కుమారుడు శశాంక్ (24)లు సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. దంపతులకు ఇటీవలే కుమార్తె వివాహం జరిగినట్లు సమాచారం. రామ్‌రాజ్ గతంలో వ్యాపారం నిర్వహించేవారని, ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఘటనకు ముందు ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బాండ్ పేపర్‌పై రాసి శశాంక్ తన స్నేహితుడికి సందేశం పంపినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఆర్థిక సమస్యలే కారణమా, లేక మరే ఇతర అంశాలున్నాయా అన్న దానిపై లోతుగా విచారణ కొనసాగుతోంది. కుటుంబ సభ్యులు, పరిచయస్తుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.

# గురుకుల హాస్టల్లో క్షుద్రపూజల కలకలం

- గూడూరు గిరిజన బాలికల వసతి గృహంలో ఉద్రిక్తత
- సరైన భోజనం, వసతులు లేవని విద్యార్థినుల ఆగ్రహం
- ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా

**వేద న్యూస్, గూడూరు**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులోని ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో క్షుద్రపూజలు నిర్వహించారనే ఆరోపణలతో విద్యార్థినులు రోడ్డెక్కారు. హాస్టల్ సమస్యలు పరిష్కరించకుండా క్షుద్రపూజలు నిర్వహించారని, సరైన భోజనం అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఉపాధ్యాయుల కొరత, వసతుల లేమి, సమయానికి భోజనం అందకపోవడం వంటి సమస్యలను ప్రస్తావిస్తూ విద్యార్థినులు పాలకుర్తి–ఘనపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. రెండు రోజుల క్రితం పాఠశాల ఆవరణలో పూజలు నిర్వహించి పసుపు నీళ్లు చల్లారని ప్రిన్సిపాల్‌పై ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో తాము భయాందోళనకు గురవుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని, ప్రతి నెలా పాఠశాలను సందర్శిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పోలీసులు విద్యార్థినులను నచ్చజెప్పి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# ట్యాంక్‌బండ్‌పై మహిళ ఆత్మహత్యాయత్నం

**ఇద్దరు కుమారులతో దూకేందుకు యత్నం**

**కుటుంబ కలహాలే కారణం.. అడ్డుకున్న పోలీసులు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ మహిళ తన ఇద్దరు కుమారులతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఘటన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై చోటుచేసుకుంది. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తంగా స్పందించడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి. జియాగూడ ఎంసీహెచ్ కాలనీకి చెందిన బి. ప్రతివ (28) తన కుమారులు అనిష్ (10), జస్వంత్ (7)తో కలిసి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంది. తెలంగాణ అమరవీరుల స్థూపం సమీపంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని ప్రశ్నించారు. విచారణలో భర్తతో తరచూ గొడవలు జరుగుతున్నాయని, విసిగిపోయి పిల్లలతో కలిసి హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించింది. వెంటనే స్పందించిన పోలీసులు తల్లీకుమారులను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 25, 2026

# రాజన్న ఆలయ ధర్మకర్తల మండలి నియామకంపై ఆశలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకంపై కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 2014 సంవత్సరం నుంచి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం జరగలేదు. ప్రతి ఏడాది మహాశివరాత్రి జాతర సందర్భంగా తాత్కాలికంగా ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తుండగా, ఈ ఏడాది అది కూడా నియమించకపోవడం గమనార్హం. ఇటీవల నామి నేటెడ్ పదవుల భర్తీపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ప్రకటన చేయడంతో స్థానిక నాయకుల్లో పదవులపై ఆశలు పెరిగాయి. ఆలయ అభివృద్ధి, పరిపాల నలో చురుకుదనం కోసం త్వరలోనే ధర్మకర్తల మండలిని నియమిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# న్యాయవాదుల విధుల బహిష్కరణ

- మహిళా న్యాయవాదిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి
- వేములవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గుడిసె సదానందం

**వేద న్యూస్, వేములవాడ:**



నిజామాబాద్ జిల్లా బోధన్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది కళ్యాణిపై ఈ నెల 22న దుండగులు దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, మంగళవారం వేములవాడ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. సంఘం అధ్యక్షుడు గుడిసె సదానందం నాయకత్వంలో న్యాయవాదులు కోర్టు ప్రధాన ద్వారం ముందు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ.. మహిళా న్యాయవాదిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే అమలులోకి తీసుకురావాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, పిట్టల మనోహర్, పెంటరాజు, కొడిమ్యాల పురుషోత్తం, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, స్రవంతి, అపర్ణ, నాయిమా నాసారి తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పది

- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- టిడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్



**వేద న్యూస్, కరీంనగర్ :**

సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) 2026 డైరీ ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారదిగా ఉన్న జర్నలిస్టుల పాత్ర గొప్పదని అన్నారు. జర్నలిస్టుల డైరీని తన చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు భాద్యతగా ఉండాలని అందులో తానుకూడా ముందు వరుసలో ఉంటానని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ లకు టిడబ్ల్యూజేఎఫ్ డైరీ ని ఫెడరేషన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో టిడబ్ల్యూజె ఎఫ్ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పిఎస్ రవీంద్ర, జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపూరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# కోఆప్షన్ పదవుల కోసం నిరీక్షణ

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల నియామకంపై ఆశావహుల్లో ఆసక్తి పెరుగుతోంది. మున్సిపల్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు కో ఆప్షన్ పదవులపై దృష్టి సారించారు. ముస్లిం నాయకులు అబ్దుల్ రజాక్, పీర్ మహ్మద్, బాబున్, క్రైస్తవ నాయకులు ఇన్నారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అలాగే పలువురు మాజీ కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యత్వం కోసం ప్రయత్నాలు ప్రారంభించినట్లు సమాచారం. ఇందులో భాగంగా వారు స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు నియామకాలు జరుగనున్న నేపథ్యంలో ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

# ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 189 అమలు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, సుమిత్ర శ్రీ వొకేషనల్ జూనియర్ కళాశాలల పరిసర ప్రాంతాల్లో భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 189 కింద ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నేటి నుంచి మార్చి 18వ తేదీ వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ ప్రశాంతంగా జరిగేందుకు తహసీల్దార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద అనవసరంగా గుంపులుగా చేరకూడదని, నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# మెడికో పేరెంట్స్ అసోసియేషన్ క్యాలండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, హైదరాబాద్:**



మేడికో పేరెంట్స్ అసోసియేషన్ తరఫున పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడంలోనూ ఇతరత్రా చేస్తున్న సహాయాన్ని తెలంగాణ రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. అసోసియేషన్ సభ్యులు మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహను బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ ఏర్పాటుచేసిన 2026 క్యాలెండర్ ను ఆయన విడుదల చేశారు ఈ సందర్భంగా సభ్యులు రాష్ట్రంలో వివిధ మెడికల్ కాలేజీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి మెడికల్ కాలేజీల్లో సమస్యల పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మల్లోజు సత్యనారాయణ చారి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, సభ్యులు పొడిశెట్టి రమేష్, కట్ట వెంకటరావు, శ్రీనివాస్, రత్న ప్రసాద్, బొడ్డుపల్లి సుజాత, సంధ్య , దుర్గాప్రసాద్, రవీందర్ , భాస్కరరావు , పత్రి యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సిబ్బందితో పూల వ్యాపారి వాగ్వాదం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రోడ్డుపై తోపుడు బండిపై పూలు విక్రయిస్తున్న ఓ వ్యాపారి, అక్కడ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న మహిళా కార్మికురాలితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, వారితో కూడా వ్యాపారి వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మున్సిపల్ సిబ్బంది సదరు తోపుడు బండిని మున్సిపల్ వాహనంలో అక్కడి నుంచి తరలించారు.

# సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించినందుకు విప్ ఆది శ్రీనివాస్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై ఆశీర్వాదం అందించారని విప్ తెలిపారు. అదేవిధంగా వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# నేడు వేములవాడలో నిరసన

- నాగర్‌కర్నూల్ ఘటనను ఖండించిన బీసీ సాధికారిత సంఘం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**




నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మర మల్లన్న జాతర సందర్భంగా రజక సామాజిక వర్గానికి చెందిన కుటుంబంపై జరిగిన దాడి, పసిబిడ్డ మౌనిక మృతి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బీసీ సాధికారిత సంఘం నాయకులు స్పందించారు. ఈ అమానవీయ ఘటనపై బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర నాయకులు కొండ దేవయ్య పటేల్, బుస్సాపూర్ శంకర్, పొలాస నరేందర్ మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను అరికట్టాలని, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం ఉదయం 10:30 గంటలకు వేములవాడలోని బీసీ సాధికారిత సంఘం కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# నకిలీ ఉత్పత్తుల విక్రయం చట్టవిరుద్ధం

- టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్ హెచ్చరిక
- నకిలీ సిగరేట్ల అమ్మకాలపై వేములవాడలో ఆకస్మిక దాడులు

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలో నకిలీ సిగరేట్ల విక్రయాలపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. పలు కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, పాన్ షాపుల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ నటేష్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ సిగరేట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో ఈ దాడులు నిర్వహించినట్లు చెప్పారు. నకిలీ ఉత్పత్తుల విక్రయం చట్టవిరుద్ధమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు చట్టాలను కచ్చితంగా పాటించాలని, నకిలీ సిగరేట్ల తయారీ లేదా విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, రాజేష్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టుపై రాజకీయ డ్రామాలు ఆపాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దుర్మార్గానికి పాల్పడుతోంది
- రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్



**వేద న్యూస్, హుస్నాబాద్:**

హుస్నాబాద్ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టును రాజకీయంగా ఉపయోగించుకుంటూ రైతులను నమ్మించి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. మంగళవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గౌరవెల్లి ప్రాజెక్టును అడ్డం పెట్టుకుని రాజకీయ దుర్మార్గానికి పాల్పడుతున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంత ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో 90 శాతం గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే పూర్తయ్యాయని, ప్రస్తుతం కాల్వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో కూడా ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాజకీయ వ్యాఖ్యలు చేయడం తప్ప అభివృద్ధి పరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ సాధించిన అభివృద్ధి కనిపించడంలేదని విమర్శించారు. రైతు భరోసా పథకాన్ని మున్సిపల్ ఎన్నికల తర్వాత అమలు చేస్తామని చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని, రైతులను పలుమార్లు మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జునరెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# పసికందు మరణానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మండల రజక, బీసీ, ఎస్సీ సంఘాల డిమాండ్



**వేద న్యూస్, ముస్తాబాద్:**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో ఇటీవల కులవివక్షతో మహిళపై దాడి జరగడంతో రెండు నెలల పసికందు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనలో బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల రజక సంఘం, బీసీ మరియు ఎస్సీ సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి కుల అహంకారంతో బీసీ, దళిత కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వారిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబమైన గణేష్, చంద్రకళలకు ప్రభుత్వ పరంగా రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించాలని కోరారు. కేసులో సంబంధం ఉన్న వారందరిపై ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక మండల సంఘం నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఓరగంటి ఆనంద్

**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన రాష్ట్ర కమిటీకి అధ్యక్షుడిగా ఓరగంటి ఆనంద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఓరగంటి ఆనంద్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల హక్కులను సాధించేందుకు మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యమకారుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాలని మంత్రి శ్రీధర్ బాబును కలిసి కోరినట్లు వెల్లడించారు. అలాగే ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించి వారి సమస్యలను వివరించినట్లు చెప్పారు. వేములవాడ మహాపాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు, పాదయాత్రలు తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమకారుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా నాయకురాలు జానకి రెడ్డి, పడిగెల రవీందర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా



అధ్యక్షుడు కనకం కుమారస్వామి, మానకొండూరు మండల అధ్యక్షుడు గోశెట్టి సంజీవ్, శంకరపట్నం మండల అధ్యక్షుడు దేవునూరి అంకుష్, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు భూమా సదానందం, జిల్లా నాయకులు తాటిపల్లి శంకర్, మామిడి మొగిలి, మామిడి వెంకన్న, బొజ్జ ఎల్లయ్య, కనకం శంకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రజక కుటుంబంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- దామరచర్ల సీపీఐ మండల కార్యదర్శి

**వేదన్యూస్, దామరచర్ల:**

నాగర్‌కర్నూల్ జిల్లాలో మల్లన్న దర్శనానికి వెళ్లిన రజక కుటుంబంపై దాడి చేసి రెండు నెలల పసిపాప మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ దామరచర్ల మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్లన్న దేవుని దర్శనానికి వెళ్తున్న చాకలి చంద్రకళ కుటుంబాన్ని కొందరు అడ్డుకుని దారుణంగా దాడి చేశారని తెలిపారు. చంద్రకళ, ఆమె కుమారుడు గణేష్, కోడలు, కుమార్తెపై అమానుషంగా దాడి చేసినట్లు పేర్కొన్నారు. కుటుంబంతో పాటు ఉన్న రెండు నెలల పసిపాపపై కనికరం చూపకుండా వ్యవహరించడం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఈ దాడి కారణంగా పసిపాప తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలు అమలు చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



# నిరుపేద యువతికి పెళ్లికి 'హెల్పింగ్ హ్యాండ్స్' చేయూత



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలం అంబం (ఆర్) గ్రామానికి చెందిన ఓ నిరుపేద యువతి వివాహానికి మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో రూ.5వేలు నగదు సహాయం అందించి, ఒక చీర బహూకరించారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు అవసరమైనప్పుడు సహాయం అందిస్తూ హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ముందుంటుందని సభ్యులు తెలిపారు. అదనంగా గ్రామానికి చెందిన శానం జ్ఞానేశ్వర్ రూ.3వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుర్లేపు గంగాధర్, ఉప సర్పంచ్ సాయిప్రసాద్, యూత్ సభ్యులు శానం గంగాధర్, మంత్రి సురేష్, తాహెర్, ఆనంద్, కమ్మరి రవి, అసంరాము, కపిల్, ఇందూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

- బూత్ స్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి
- కర్ర సత్య ప్రసన్నారెడ్డి

**వేద న్యూస్, కరీంనగర్:**



బూత్ స్థాయి నుంచి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, గత పది సంవత్సరాల టీఆర్ఎస్ పాలనలో ప్రతిపక్షంగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ సీనియర్ మహిళా నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ నామినేటెడ్ పదవుల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాలని కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి కోరారు. డీసీసీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ర సత్య ప్రసన్నారెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పార్టీ కోసం శ్రమించిన మహిళా నాయకులకు న్యాయం జరగాలని, మహిళా కాంగ్రెస్‌కు తగిన గుర్తింపు రావాల్సిన సమయం ఇదన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని, మహిళా కాంగ్రెస్‌కు న్యాయం జరిగేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా మహిళా కాంగ్రెస్‌లో కష్టపడ్డ మహిళలకు అవకాశాలు దక్కేలా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గాజుల సుకన్య, వంగల కళ్యాణి రెడ్డి, నగర అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి, మానకొండూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కవ్వ పద్మ, కరీంనగర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హసీనా, జిల్లా బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, కార్పొరేషన్ డివిజన్ మహిళా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లిలో చోరీ

- ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి అపహరణ

**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన సుదిరెడ్డి ధర్మరెడ్డి నివాసంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిబ్రవరి 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. దేవుడి గదిలో ఉంచిన సుమారు 4 గ్రాముల బంగారు సత్యనారాయణ స్వామి విగ్రహం, అలాగే సుమారు మూడు తులాల బరువున్న రెండు వెండి గ్లాసులను అపహరించినట్లు ఫిర్యాదుదారు బెందరం సద్గుణ పోలీసులకు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ వెల్లడించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలను సేకరించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



# కారు, ఆటో ఢీ..

- పలువురికి గాయాలు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ వద్ద కారు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. సిరిసిల్ల నుంచి గొల్లపల్లి వైపు వెళ్తున్న ఆటోను కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపు అతివేగంగా వస్తున్న కారు హరిదాస్ నగర్ వద్ద ఢీకొట్టినట్లు సమాచారం. ఢీకొన్న ప్రభావంతో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రమాదం అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతున్న కారును వెంకటాపూర్ గ్రామస్థులు అడ్డుకున్నట్లు తెలిసింది. ఆటో రాజన్నపేటకు చెందిన రెడ్డిమల్ల నర్సయ్యదిగా సమాచారం. ఢీకొన్న కారు ఎల్లారెడ్డిపేటకు చెందినదిగా ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

# నెలలు గడిచినా మురుగు అంతే..

- కాలువలు శుభ్రం చేయకపోవడంతో వార్డు ప్రజల ఆగ్రహం

**వేదన్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని 8వ వార్డులో రెండు నెలలుగా మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్య పరిస్థితి దారుణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండి తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. అలాగే ఈగలు, దోమలు విస్తరిస్తూ ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, నెలలు గడిచినా పరిష్కారం లేకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగు కాలువలను వెంటనే శుభ్రపరచాలని, ఈగలుదోమల కారణంగా వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.



వేద న్యూస్
బుధవారం ఫిబ్రవరి 25, 2026

# డ్రైనేజీ కాలువల్లో దుశ్చర్యలు

**– అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు**

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండల పరిధిలోని భజ్య తండా గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన బొక్కల తండాలో డ్రైనేజీ కాలువలకు అడ్డంకులు సృష్టిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు నిర్మించిన సైడ్ డ్రైనేజీ కాలువల్లో కొందరు పెద్ద రాళ్లు వేయడంతో నీరు నిల్వై అపరిశుభ్ర పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. అలాగే కొంతమంది మద్యం సేవించి ఖాళీ గ్లాసులను డ్రైనేజీల్లో పడేస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలు ఉద్దేశపూర్వకంగానే జరుగుతున్నాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను దెబ్బతీసే ప్రయత్నంగా వీటిని చూస్తున్నామని పేర్కొన్నారు. డ్రైనేజీల్లో అడ్డంకులు ఏర్పడటంతో దుర్వాసన వ్యాపించడమే కాకుండా ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రాజకీయ విభేదాల పేరుతో ప్రజా ఆస్తులకు నష్టం కలిగించడం తగదని వారు హెచ్చరిస్తున్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై స్పష్టత లేకపోవడం బాధాకరం

**– సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్**

**వేదన్యూస్, దామరచర్ల:**



తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఎలాంటి స్పష్టమైన నిర్ణయం ప్రకటించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని గురుకుల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్ తెలిపారు. మంగళవారం దామరచర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయంలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినప్పటికీ, తాజా క్యాబినెట్ సమావేశంలో వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు లేకుండా అనేక శాఖలు సజావుగా నడవడం కష్టసాధ్యమని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై స్పష్టమైన విధాన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గౌరవించి, త్వరితగతిన సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వీర నాయక్, సునీత, స్వరాజ్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**– జిల్లాలో మొత్తం 16 కేంద్రాలు**

**వేద న్యూస్, సిరిసిల్ల:**



నేటి నుంచి వచ్చే నెల మార్చి 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల సందర్భంగా సిరిసిల్ల జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, సహస్ర జూనియర్ కళాశాల, సాయిశ్రీ జూనియర్ కళాశాలతో పాటు తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లిలోని టీజీఎస్ డబ్ల్యుఆర్జేసీ కళాశాలలో చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 4,046 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4,060 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షల పర్యవేక్షణ కోసం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శరత్ కుమార్, తంగళ్ళపల్లి మండల తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ వాహనాలపై రవాణా శాఖ ఉక్కుపాదం

**– జిల్లావ్యాప్తంగా తనిఖీలు 15 వాహనాలు సీజ్**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో రవాణా శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని పలు మండలాల్లో పాఠశాల విద్యార్థులను తరలించే ఆటోలు, బస్సులను మోటారు వాహన తనిఖీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో నిర్వహించిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 15 వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, వాహన యజమానులకు పలు సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థులను పరిమితికి మించి వాహనాల్లో ఎక్కించకూడదని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన టాక్స్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్ సర్టిఫికేట్‌లతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని సూచించారు. అధిక లోడ్‌తో సరుకు రవాణా వాహనాలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సులను సస్పెండ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన తనిఖీ అధికారి వంశీధర్, సహాయక అధికారులు పృద్విరాజ్ వర్మ, రజని, కానిస్టేబుళ్లు రమ్య, సౌమ్య, ప్రశాంత్, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి మృతికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలి

**– శాలివాహన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహన్**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల నిర్వహించిన కుమ్మెర మల్లన్న జాతరలో కులం పేరుతో ఓ కుటుంబాన్ని దూషించి , చిన్నారిని కాళ్ళతో తన్ని చిన్నారి మృతికి కారణమైన బాధ్యులను కఠినంగా శిక్షించాలని శంభునిపేట, రంగశాయి పేట శాలివాహన సంఘం బాధ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం రంగశాయి పేట శాలివాహన సంఘం భవనంలో చిన్నారి మృతికి సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష్య, కార్యదర్శులు ఆవునూరి రవి, కందికొండ మోహన్ మాట్లాడుతూ కులం పేరుతో కుటుంబాన్ని దూషంచి దాడి చేయడమే కాక 2 నెలల చిన్నారిని అక్కడున్న పెత్తందార్లు అమానావియంగా చంపడం దుర్మార్గమని అగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఘటన సమయంలో పోలీసులు అక్కడ వున్నప్పటికీ ఇలాంటి దారుణం చోటు చేసుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని, చిన్నారి మృతికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘం ఉపాధ్యక్షుడు ఆవునూరి కుమార స్వామి, కోశాధికారులు కుమారస్వామి, భిక్షపతి, సంఘం సభ్యులు దేవేందర్,రాజేష్, సురేష్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

**– మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ**

**వేద న్యూస్, హైదరాబాద్:**

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డులు ఇచ్చి హెల్త్ పాలసీ అమలు చేయాలని మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో జర్నలిస్టులు పోరాడి సాధించుకున్న హెల్త్ కార్డును, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో మంగళవారం టీయూడబ్ల్యూజే ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్యమంత్రి కాక ముందే, ఉద్యమ సమయంలో తను జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం, ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డును జి ఓ 64 రూపంలో తీసుకువచ్చి కార్డులు ఇచ్చి అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ లో చెల్లు బాటు అయ్యేలా అమలు చేశారని అల్లం నారాయణ చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం హాయంలో జర్నలిస్టులకు ఇచ్చిన క్యాష్ లెస్ హెల్త్ కార్డు వల్ల జర్నలిస్టులకు కోట్లాది రూపాయల వైద్య సహాయం అందిందని ఆయన గుర్తు చేశారు. అదే కార్డు ఇప్పటి వరకు నిమ్స్ వంటి హాస్పిటల్స్ లో చెల్లుతుందని అన్నారు. నిన్న కేబినెట్ మీటింగ్ అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనలో ఉద్యోగులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు స్కీమ్ లో జర్నలిస్టుల విషయం లేక పోవడం అత్యంత బాధాకరం ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జర్నలిస్టులకు గత ప్రభుత్వం కంటే మెరుగైన విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి అయినా జర్నలిస్టులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని అన్నారు. కొత్తగా ఏమీ ఇవ్వకపోగా, ఉన్న అక్రెడిటేషన్ కార్డులలో కోత విధించడం, ఉన్న హెల్త్ కార్డును కూడా తీసివేయడం అత్యంత శోచనీయం అని అన్నారు.




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులు కనబడం లేదా? అని ప్రశ్నించారు. అసలు మీ దృష్టిలో జర్నలిస్టులు ఉన్నట్టా...? లేనట్టా....? అని అల్లం నారాయణ ఈ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్టుగా ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈ హెచ్ ఎస్ మాదిరిగా ఇప్పటికే ఉన్న జె హెచ్ ఎస్ ను కూడా కొనసాగించాలన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు చేయకపోతే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి జర్నలిస్టుల ఉద్యమం ఎలా ఉంటుందో చూపిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్లపాటు పోరాడిన వాళ్లం, జర్నలిస్టుల ప్రయోజనాల కోసం మరోసారి పోరాడుతామని అయిన హెచ్చరించారు. ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్న టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల పై కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది అన్నారు. ఒక వైపు అక్రెడిటేషన్ కార్డులలో కోత, మరో వైపు ఉన్న హెల్త్ కార్డును కూడా తొలగించడం దారుణం అన్నారు. గత ప్రభుత్వంలో లాగే జర్నలిస్టులకు క్యాష్ లెస్ హెల్త్ కార్డు అమలు చెయ్యాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఉద్యమిస్తారని మారుతీ సాగర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి 20 లక్షల బీమా సొమ్ము వచ్చేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం గత ప్రభుత్వం జి ఓ నెంబర్ 22 తో జర్నలిస్టులకు, ఆటో డ్రైవర్లకు, హోమ్ గార్డులకు అమలు చేసిన 5 లక్షల ప్రమాద బీమా పాలసీని ప్రీమియం కట్టి మరీ రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు.ఈ విషయంలో ఇప్పటికే వారు కూడా ఆందోళన బాట పట్టారనే విషయాన్ని గుర్తు చేస్తూ వెంటనే బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూ డబ్ల్యూ జే రాష్ట్ర కోశాధికారి పి.యోగనంద్, హైదరాబాద్ నగర ఇంచార్జ్ యార నవీన్ కుమార్, టీయూ డబ్ల్యూ జే నగర కోశాధికారి బాపు రావు, కేబుల్ చానెల్స్ జర్నలిస్టుల జేఏసీ నేత కడకంచి వెంకటేష్, టీయూ డబ్ల్యూ జే నేత లాయక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉట్నూర్ ఐటీడీఏ చైర్మన్ పదవిపై చర్చ

**– జల్కే పాండురంగ్‌కు మద్దతుగా కాంగ్రెస్ నేతల వినతి**



**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ చైర్మన్ పదవి నియామకం అంశం జిల్లాలో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన ఈ పదవిని ఆదివాసీ బిడ్డకే కేటాయించాలని డిమాండ్ బలపడుతోంది. ఈ నేపథ్యంలో బజార్ హత్నూర్ మండలం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జల్కే పాండురంగ్‌కు మద్దతుగా పలువురు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్ స్వీకరించినట్లు సమాచారం. గిరిజనుల సమస్యలను సమగ్రంగా అర్థం చేసుకునే నాయకత్వం అవసరమని, ఆదివాసీ కుటుంబానికి చెందిన జల్కే పాండురంగ్ ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరని నాయకులు పేర్కొన్నారు. అడవి హక్కులు, భూమి సమస్యలు, ఉపాధి, విద్య, ఆరోగ్య రంగాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆయనకు అవగాహన ఉందని తెలిపారు. పార్టీ కష్టకాలంలోనూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుడిగా ఆయనను కొనియాడారు. ఐటీడీఏ చైర్మన్ పదవి కేవలం రాజకీయ నియామకం కాకుండా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి దిశానిర్దేశం చేసే బాధ్యతగా వారు అభివర్ణించారు. ఆదివాసీ బిడ్డ చేతుల్లో ఈ బాధ్యత ఉంటే ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని, గిరిజనుల విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆడే గజేందర్ ఈ విషయాన్ని ఉన్నత నాయకత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 25, 2026

# మహిళా న్యాయవాదిపై దాడి హేయం

**– బాధితురాలికి సంపూర్ణ మద్దతు ప్రకటించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు**



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ గ్రామానికి చెందిన మహిళా న్యాయవాదిపై జరిగిన దాడి హేయమైన చర్య అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులకర్ణి పేర్కొన్నారు. మంగళవారం రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్‌సీ కాలనీలో నివసిస్తున్న బాధిత మహిళా న్యాయవాదిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ, ఇటీవల బాన్సువాడలో, అలాగే రుద్రూర్‌లో జరిగిన దాడుల ఘటనలను ప్రస్తావిస్తూ, ఇలాంటి సంఘటనలు సమాజంలో విభేదాలు సృష్టించేలా ఉన్నాయని అన్నారు. బాధిత మహిళా న్యాయవాదిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి సంబంధించిన వీడియోలు, ఆధారాలు ఉన్నప్పటికీ కేసు విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. మహిళా న్యాయవాదికి బీజేపీ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, నాయకులు పార్వతి మురళి, కటికే రామ్ రాజ్, ఎముల గజేందర్, అనిల్, కుమ్మరి గణేష్, వడ్ల సాయినాథ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తగాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి

**– సనుగుల, దేవుని తండా గ్రామాల ప్రజలు**



**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండల కేంద్రంలోని సనుగుల, దేవుని తండా గ్రామాల మధ్య తలెత్తుతున్న వివాదాలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 2019 వరకు ఉమ్మడి గ్రామాలుగా కొనసాగిన సనుగుల –దేవుని తండా గ్రామాలు, అదే సంవత్సరంలో వేర్వేరు గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయి. అప్పటి నుంచి సనుగుల ముదిరాజ్, దేవుని తండా లంబాడ కులస్తుల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు. దేవుని తండా గ్రామ పరిధిలో రెండు చెరువులు, సనుగుల గ్రామ పరిధిలో రెండు చెరువులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ చెరువులను ఇరు గ్రామాలకు సమానంగా కేటాయించి, మత్స్య సహకార సంఘాల ద్వారా ఉపాధి కల్పిస్తే వివాదాలు నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై జిల్లా మత్స్య పారిశ్రామిక అధికారి (డీఎఫ్ఓ)కు వినతి పత్రం అందజేసినా స్పందన లేకపోవడంతో, జాతీయ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ అధికారికి జాటోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య మోహన్, ఉపసర్పంచ్ నునావత్ బిక్యా, మత్స్యశాఖ అధ్యక్షుడు భూక్య గోపాల్, సభ్యులు మోబిలాల్, ఫుల్ సింగ్, సోమ్లా గేన్య, రాంజీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వధువుకు పుస్తె మట్టెల బహూకరణ

**– అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**



వేద న్యూస్, చందుర్తి:

చందుర్తి మండల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన కీరిశేషులు కారుకూరి లక్ష్మయ్య–బక్కవ్వ దంపతుల కుమార్తె కారుకూరి నిఖితకు పుస్తె మట్టెలను బహుకరించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. నూతన వధూవరులను అయ్యప్ప స్వామి ఆశీర్వదించాలని, వారు సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు తిప్పని శ్రీనివాస్, మర్రి మల్లేశం, రాజూరి రవీందర్, పోతరాజు రవి, సిరికొండ కనకయ్య, మార్త మల్లేశం, తిప్పని భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

**– భద్రతపై అవగాహన కల్పించేందుకే 'సన్నిహిత'**
**– డీసీపీయూ అధికారి కవిత దేవి**



**వేద న్యూస్, చొప్పదండి:**

విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకుని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యలో ముందంజలో ఉండాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (డీసీపీయూ) అధికారి కవిత దేవి సూచించారు. మండల పరిధిలోని వెదురుగట్ట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో సన్నిహిత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవిత దేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా చదువుపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమని, ఈ దశలోనే భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. సమాజంలో విద్యార్థులపై జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలను వివరించి, తమ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుచిత సంఘటనలు ఎదురైతే వెంటనే ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. టీనేజ్ వయస్సులో వచ్చే ప్రభావాలను గుర్తించి క్రమశిక్షణతో ఉండాలని, బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఐసీడీఎస్ సూపర్వైజర్ నస్రత్, గ్రామ సర్పంచ్ పెంచాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ సమత, వైద్యుడు సురేందర్, సిహెచ్ఓ వెంకటస్వామి, ఏఎన్ఎం లక్ష్మి, ఐకెపి సీఏలు కార్తీక, లావణ్య, అంగన్వాడీ టీచర్లు రమ, లక్ష్మి నర్సమ్మ, జమున, కమలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొమ్మాల జాతర బ్రహ్మోత్సవాలపై సమీక్ష



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్య శారద కలెక్టరేట్ లో మంగళవారం గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 3 నుంచి మార్చి 8 వరకు వైభవంగా నిర్వహించడం జరుగుతుందని, పేర్కొన్నారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పోలీస్, ఆరోగ్య, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, జిల్లా పంచాయతీ, పౌర సంబంధాల, అగ్నిమాపక తదితర శాఖలు సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, క్యూ లైన్లు, త్రాగునీటి సదుపాయం, అన్నదాన కార్యక్రమాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు, వైద్య శిబిరాలు, శానిటేషన్ చర్యలు సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జాతర ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లా పౌర సంబంధాల శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వాహక అధికారిని సూచించారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు..

# చేవెళ్ల అంబేద్కర్ అభయ హస్తం ఎక్కడ?

**– రెండు సంవత్సరాలు కావస్తున్న పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం**
**– దళిత మహాసభను విజయవంతం చేయండి**
**– మైస ఉపేందర్ మాదిగ**



**వేద న్యూస్, కాజీపేట:**

చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ సందర్భంగా ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షల అంబేద్కర్ అభయ హస్తం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలులోకి రాలేదని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ విమర్శించారు. కాజీపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీలకు దళిత బంధు కింద రూ.10 లక్షలు అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కలెక్టర్ ఖాతాలో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చకపోతే ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. మార్చి 18న మాదిగ హక్కుల పరిరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దళిత మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పలు జిల్లాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన రజక సంఘం నాయకులు



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నాగర్ కర్నూల్లో రజక కుటుంబంపై జరిగిన దారుణ దాడి ఘటన నేపథ్యంలో, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా రజక సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జరిగిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, బాధితులకు ధైర్యం చెప్పి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సంబంధిత అధికారులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం జరగాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడిలో మరణించిన అమ్మాయి మౌనిక సమాధిని సందర్శించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కర్నూలులో నిర్వహించిన ర్యాలీలో వివిధ కుల సంఘాల నాయకులు, బీసీ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బిక్షపతి, మర్రి కుక్కల చైతన్య, పంతంగి సమ్మయ్య, దొడ్డిపాటి శేఖర్, బండి సదానందం తదితరులు ఉన్నారు.

# నూతన సర్పంచులకు శిక్షణ



**వేదన్యూస్, కారేపల్లి:**

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఖమ్మం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో సింగరేణి మండల నూతన సర్పంచులకు శిక్షణా కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. గ్రామ పాలన, పంచాయతీ నిధుల వినియోగం, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, పచ్చదనం పెంపొందింపు వంటి అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించే విధానంపై అధికారులు దిశానిర్దేశం చేశారు. సర్పంచులు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని అధికారులు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటులను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, పంచాయతీ అధికారులు, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

# అక్రమంగా మట్టి తరలింపు

**– జేసీబీ, రెండు ట్రాక్టర్లు స్వాధీనం**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలో అక్రమ మట్టి తరలింపుపై పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున విలాసాగర్ గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలిస్తున్న ఒక జేసీబీ యంత్రంతో పాటు రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు బోయినిపల్లి ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తవ్వకం, రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మట్టి తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# బీజేపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



**వేద న్యూస్, కాజీపేట:**

బీజేపీ నాయకుడు, దర్గా సొసైటీ డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు మంగళవారం పరామర్శించారు. ముందుగా రాజ్‌కుమార్ తల్లి చిన్నమ్మకు నివాళులు అర్పించి, అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ శ్రేయస్సు కోసం చిన్నమ్మ అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమ్మ అల్లుడు మేకల కేదారి యాదవ్, కాంటెస్ట్ కార్పొరేటర్ మేకల శ్రావణ్ యాదవ్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 25, 2026

## వైద్య ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ వైద్య, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నేటి సాయి రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య ఆరోగ్య సిబ్బంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా తెలంగాణ వైద్య మరియు ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం (హెచ్1), అనుబంధ భారత జాతీయ కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.డి. అజీజ్, ప్రధాన కార్యదర్శిగా తోట రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జనార్ధన్, కోశాధికారిగా వెంకటరమణ, న్యాయ సలహాదారుగా అబుజార్ అహ్మద్ ఖాన్ ఎన్నికయ్యారు. అంతకుముందు సంఘం గౌరవ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది రషీద్, రవి, లక్ష్మి, జ్యోతి, శ్రీధర్, రవీందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అఫ్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై విద్యార్థులకు అవగాహన

- సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- షీ టీమ్ సూచనలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతిరోజూ విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాలను సందర్శిస్తూ భద్రతా అంశాలపై అవగాహన కల్పిస్తోంది. గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా రక్షణ చట్టాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బోయినిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీని షీ టీమ్ బృందం సందర్శించింది. వేధింపులకు గురైన సందర్భాల్లో నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ రఘునాథ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హరీశ్‌రావుకు ఘన స్వాగతం

**వేద న్యూస్, మడికొండ:**



హన్మకొండ జిల్లా మడికొండలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుకు మంగళవారం ఘన స్వాగతం లభించింది. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీక్ష నిమిత్తం వెళుతున్న ఆయనకు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సమక్షంలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. మడికొండ చౌరస్తా గులాబీ జెండాలు, నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు కార్యకర్తలతో ముచ్చటించి వారి ఉత్సాహాన్ని అభినందిం చారు. ఈ సందర్భంగా ఆయన అందరితో కరచాలనం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మడికొండ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, అభిమానులు, వర్ధన్నపేట నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

**వేద న్యూస్, కాజీపేట:**



కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్ రోడ్ న్యూ సైన్స్ డిగ్రీ కళాశాలలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ అవసరం, హెల్మెట్ వినియోగం గురించి విద్యార్థులకు వివరించారు. 18 సంవత్సరాలు పూర్తైన వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని సూచించారు. అనంతరం హంటర్ రోడ్ శాయంపేట జంక్షన్ వద్ద హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. హెల్మెట్ ప్రాముఖ్యతను వివరించి కొంతమందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు శ్రావణ్ కుమార్, సంపత్, కళాశాల ప్రిన్సిపల్ కమలాకర్, వైస్ ప్రిన్సిపల్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు

**వేద న్యూస్, పాపన్నపేట:**



మండల కేంద్రం పాపన్నపేటలో రేణుకా ఎల్లమ్మ బోనాల వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దారు. సాయంత్రం మహిళలు పట్టు వస్త్రాలు ధరించి అలంకరించిన బోనం కుండలను తీసుకుని ర్యాలీగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ర్యాలీలో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువతీయువకుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గౌడ కులస్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు

**వేద న్యూస్, మంచిర్యాల:**




10వ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నేటి నుంచి మార్చి 16 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు 10వ తరగతి పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయాల్లో 163 బీఎన్ఎస్–ఎస్ సెక్షన్ అమలు చేయాలని సూచించారు. జిరాక్స్ సెంటర్లు మూసివేయడం, విద్యుత్ అంతరాయం లేకుండా చూడడం, వైద్య సదుపాయాలు, తాగునీరు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటర్ పరీక్షల కోసం 23 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 12 వేల మందికి పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. 10వ తరగతి పరీక్షల కోసం 48 కేంద్రాలు ఏర్పాటు చేసి 9,748 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం.. పంటలకు తీవ్ర నష్టం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండలం లోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న సహా ఇతర పంటలు నేలకూలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగుకు భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షకొండ గ్రామానికి చెందిన రైతుల పొలాలను జీపీవో రాజేశం, సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ కలిసి పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేసి తగిన పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మల నర్సయ్య, దుబాసి రాజేష్, అమందు రాజేందర్, అమందు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు మార్కెటింగ్, నాణ్యతపై సమీక్ష సమావేశం

**వేద న్యూస్, మందమర్రి:**




దేశ అవసరాలకు అనుగుణంగా బొగ్గు నాణ్యత, వినియోగదారుల అవసరాలు మరియు రాబోయే సవాళ్లను అధిగమించే అంశాలపై మంగళవారం మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మార్కెటింగ్, క్వాలిటీ ఉన్నతాధికారులు మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు సంబంధించిన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు సమర్పించారు. డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. జీఎం క్వాలిటీ (కార్పొరేట్) ఎ. రవికుమార్ మాట్లాడుతూ, ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరికీ నాణ్యతపై అవగాహన అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎం కోఆర్డినేషన్ & మార్కెటింగ్ (కార్పొరేట్) టి. శ్రీనివాస్, మందమర్రి జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జీఎం కే. విజయభాస్కర్ రెడ్డి, రీజినల్ క్వాలిటీ (బెల్లంపల్లి రీజియన్) పి. వీరభద్రరావు, రీజినల్ క్వాలిటీ జీఎం (రామగుండం రీజియన్) సుజోయ్ ముజేందర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా చెక్కు అందజేత

**వేద న్యూస్, రుద్రూర్:**



బోధన్ ఏరియాలోని రుద్రూర్ మండల పరిధిలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్రాంచ్ ద్వారా భీమా చెక్కు అందజేశారు. బోధన్‌కు చెందిన షేక్ పాషా నాలుగు నెలల క్రితం రూ.21,000 పాలసీ తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యం తో ఆయన మృతి చెందడంతో నామినీ అయిన ఆయన భార్య అమీనాబీకి రూ.3,37,000 భీమా మొత్తాన్ని మంగళవారం అందజేశారు. కంపెనీ డీజీఎం సురేష్, డీఎం నగేష్ సమక్షంలో తహసీల్దార్ తారాబాయి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సౌందర్య, ఉద్యోగులు రాఘశ్రీ, మహేందర్, సురేఖ, వికాస్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ దిలీప్ పటేల్, ఏజెంట్ జెరీనా, వార్డు సభ్యురాలు అమృత, వడ్ల నరేష్, శివ, కమ్మరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

**వేద న్యూస్, రుద్రూర్:**



బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశాల మేరకు రుద్రూర్ మండలంలోని రాయకూర్ క్యాంపు గ్రామంలో ఉన్న ఎంపీయూపీఎస్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం తహసీల్దార్ తారాబాయి సందర్శించారు. పాఠశాలలో మూడవ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నట్లు గుర్తించిన తహసీల్దార్, ఆయా సబ్జెక్టులపై మరింత శ్రద్ధగా, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె ఆదేశించారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 25, 2026

# మున్సిపల్ వైస్ చైర్మన్ కు ఘన సన్మానం



- కొత్తపల్లి యువత ఆధ్వర్యంలో..
- జమ్మికుంట అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తాను వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన ముంతాజ్ అలీని కొత్తపల్లిలో వారి నివాసంలో వివిధ వార్డులకు చెందిన యువత మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా మంగళవారం సన్మానించారు. ఇటీవల ఆయన చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వార్డుల యువత ఆయనకు శాలువా కప్పి, పూలమాలలతో అభినందనలు తెలియజేశారు. పట్టణంలోని యువత సమస్యలు, స్థానిక అవసరాలపై చర్చిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండి పనిచేస్తానని, యువతతో సమన్వయం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జైదా రాజేందర్, జైదా ప్రశాంత్, టీ. శ్యామ్ కిషోర్, కొక్కుల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘన సన్మానం

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లకు..
- మెప్మా ఆధ్వర్యంలో..



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం లో మెప్మ వారి ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)ను వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ ని ఘనంగా సన్మానించారు. సందర్భంగా చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, ఇల్లాలే ఇంటికి దీపం కాబట్టి మీరు ముందుండి మీ కుటుంబాన్ని మరియు మన జమ్మికుంట పట్టణం అభివృద్ధి పథంలో మీ పాత్ర కూడా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి టిఎంసి మల్లీశ్వరి, సిఎల్ అర్పీలు జ్యోతి, మంజుల, అర్పిలు దేవేంద్ర, విజయ, సరళ లతో పాటు పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.

# అనుమానాస్పదం కాదు.. హత్యే

- ఆరుగురు నిందితుల అరెస్ట్



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం ఏర్దండి గ్రామంలో ఈ నెల 20న ఎర్రోళ్ల లింబాద్రి (51) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన హత్యేనని పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా మృతుడు కొంత కాలంగా వేధింపులకు పాల్పడుతున్నాడనే కారణంతో ఆయన భార్య ఎర్రోళ్ల లక్ష్మీ, కుమారుడు లితిప్‌తో పాటు కల్లెడ నరేందర్, బోదాసు సంతోష్, కల్లెడ వర్షిత్, కల్లెడ సంపత్ కలిసి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి రెండు ఇనుప స్టేజ్ పైపులు, మూడు బైకులు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిని ఈ నెల 23న అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్

# 11వ వార్డు కౌన్సిలర్ కు సన్మానం

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం ఆధ్వర్యంలో..



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి 11వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన పొనగంటి విష్ణు ను మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులో రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం, కౌన్సిలర్ పొనగంటి విష్ణును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ.. వార్డు ప్రజలు తనపై నమ్మకంతో తనను గెలిపించినందుకు ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేసి.. అందుబాటులో ఉండి వారికి సేవలందిస్తానని అన్నారు. జమ్మికుంట మున్సిపాలిటీలో 11వ వార్డు ను మున్సిపాలిటీలోనే ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు పొనగంటి మల్లయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత

**వేద న్యూస్, సుల్తానాబాద్:**



పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం అని సుల్తానాబాద్ మండల పరిధిలోని కాట్నపల్లి గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలువురు కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే చింతకుంటతో కలిసి కాట్నపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో దాసరి పద్మ, నోముల గీత, కొర్రె సులోచన ఉన్నారు.

# దివ్యమూర్తి అభిమానుల సంఘం అధ్యక్షుడిగా రవితేజ

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



నల్గొండ జిల్లా దేవరకొండ పట్టణానికి చెందిన గంజి రవితేజను డా. గుగ్గిళ్ల దివ్యమూర్తి అభిమానుల సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ, డా. దివ్యమూర్తి ప్రతిభ, సేవా కార్యక్రమాల ప్రభావంతో ఆయనకు అభిమానిగా మారినట్లు తెలిపారు. అభిమానుల సంఘం తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# స్వేచ్ఛకు పరిమితి లేకపోతే బాధ్యత ఎక్కడ?

**వేద న్యూస్ డెస్క్:**

సాంకేతిక విప్లవం మన సంభాషణ శైలిని పూర్తిగా మార్చేసింది. ఒకప్పుడు వార్తలు చేరడానికి రోజులు పట్టేవి. ఇప్పుడు క్షణాల్లో ప్రపంచమంతా చేరుతున్నాయి. ఈ మార్పుకు ప్రధాన వేదిక సామాజిక మాధ్యమాలు. ఇవి ప్రజాస్వామ్య చర్చలకు, సమాచార మార్పిడికి, సామాజిక చైతన్యానికి శక్తివంతమైన సాధనాలు. అయితే ఈ స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అవసరం. ఈ అవగాహనను పెంపొందించడానికే ప్రపంచ సామాజిక మాధ్యమ బాధ్యత దినం జరుపుకుంటారు.

సామాజిక మాధ్యమాలు ప్రజలకు గొంతుక ఇచ్చాయి. ప్రతి వ్యక్తి తన అభిప్రాయాన్ని వ్యక్తపరచగల వేదిక లభించింది. ఇది సానుకూల మార్పులకు దోహదపడింది. సామాజిక ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు, అవగాహన ప్రచారాలు వేగంగా వ్యాపించాయి. కానీ ఇదే వేదిక తప్పుడు ప్రచారం, అపోహలు, అసత్య వార్తలకు కూడా మార్గం కల్పిస్తోంది. ఒక అసత్య సమాచారం క్షణాల్లో లక్షల మందికి చేరుతుంది. అది సమాజంలో ఉద్రిక్తతలకు, అపార్థాలకు దారి తీస్తుంది. తప్పుడు ప్రచారం కేవలం సమాచార లోపం కాదు; అది ప్రమాదం. ఆరోగ్య సంబంధిత అపోహలు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించవచ్చు. సామాజిక అంశాల్లో తప్పుడు వార్తలు విభేదాలను పెంచవచ్చు. అందుకే సమాచారాన్ని పంచుకునే ముందు నిజానిజాలను నిర్ధారించడం ప్రతి ఒక్కరి బాధ్యత. వినడం మాత్రమే కాదు; పరిశీలించడం కూడా అవసరం.

ద్వేష సందేశాలు మరో ప్రధాన సవాల్. భిన్న అభిప్రాయాలను గౌరవించకుండా దూషణలు, అవమానాలు, ద్వేష ప్రచారం సమాజ ఐక్యతను దెబ్బతీస్తాయి. అభిప్రాయ భేదాలు సహజం. కానీ అవి గౌరవంతో వ్యక్తం కావాలి. సంభాషణ వేదిక ద్వేషానికి మారితే ప్రజాస్వామ్య చర్చ బలహీనపడుతుంది. అందుకే డిజిటల్ సంస్కృతిలో మర్యాద, సహనం, పరస్పర గౌరవం అవసరం. యువత సామాజిక మాధ్యమాల ప్రధాన వినియోగదారులు. అందుకే డిజిటల్ బాధ్యతపై వారికి ప్రత్యేక అవగాహన అవసరం. విద్యాసంస్థలు డిజిటల్ నైతికత, గోప్యత పరిరక్షణ, సైబర్ భద్రతపై చర్చలు నిర్వహించాలి. కుటుంబాలు పిల్లలకు బాధ్యతాయుత వినియోగం గురించి మార్గనిర్దేశం చేయాలి. సమయం నియంత్రణ కూడా ముఖ్యం. సామాజిక మాధ్యమాలు ఉపయోగకరంగా ఉండాలి; ఆధారపడే అలవాటుగా మారకూడదు.

సాంకేతికతను పూర్తిగా నిరాకరించడం సాధ్యం కాదు. అది మన జీవన భాగమైంది. కానీ దాని వినియోగం సమతుల్యంగా ఉండాలి. గోప్యతను కాపాడుకోవడం, అపరిచిత లింకులు, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండడం, ద్వేష ప్రచారాలకు దూరంగా ఉండడం. ఇవి బాధ్యతాయుత వినియోగానికి అవసరమైన చర్యలు. ప్రపంచ సామాజిక మాధ్యమ బాధ్యత దినం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. స్వేచ్ఛకు పరిమితి ఉండాలి. మాటకు విలువ ఉండాలి. సమాచారాన్ని పంచే ముందు ఆలోచించాలి. ద్వేషం కంటే గౌరవం, సంచలనాల కంటే నిజం, వేగం కంటే బాధ్యత ముఖ్యం. డిజిటల్ ప్రపంచం మన చేతుల్లో ఉంది.

# వెలుగుమట్ల భూదాన్ భూములు ప్రభుత్వాధీనంలోకి..

- అక్రమ కట్టడాల తొలగింపు
- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి




**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

తెలంగాణ భూదాన్ యజ్ఞ బోర్డు ఆదేశాల మేరకు వెలుగుమట్ల భూదాన్ భూములను ప్రభుత్వాధీనంలోకి తీసుకున్నట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 1953లో సర్వే నెంబర్లు 147, 148, 149లో 31 ఎకరాలు 7 గుంటల భూమిని భూదాన్‌గా దానం చేసినట్లు తెలిపారు. అనంతరం ఈ భూములు ఆక్రమణకు గురయ్యాయని, హైకోర్టు ఉత్తర్వులు, భూదాన్ బోర్డు ఆదేశాల ప్రకారం హైకోర్టులో పిటిషన్ ఉన్న నిర్మాణాలు మినహా మిగిలిన అక్రమ కట్టడాలను తొలగించినట్లు వెల్లడించారు. భూదాన్ భూముల్లో ఎటువంటి వ్యక్తిగత కేటాయింపులు చేయలేదని, కేవలం కేజీబీవీ మరియు మోడల్ స్కూల్ కోసం 10 ఎకరాలు మాత్రమే కేటాయించబడినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ఆక్రమణదారుల సామాగ్రిని అంబేద్కర్ భవనంలో భద్ర పరిచినట్లు, అవసరమైతే వారికి అందజేస్తామని చెప్పారు. నిరాశ్రయులైన వారికి తాత్కాలిక వసతి కల్పించినట్లు తెలిపారు. అడిషనల్ డీసీపీ ప్రసాదరావు మాట్లాడుతూ భూదాన్ భూముల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

# ఇంటర్ విద్యార్థులకు ఎమ్మెల్యే విషెస్



**వేద న్యూస్, కారేపల్లి:**

రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా వైరా నియోజకవర్గ విద్యార్థులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలు భయపడే అంశం కాదని, తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏడాది పాటు చేసిన కృషి వృథా కాదని, గురువులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకుని హాల్ టికెట్, అవసరమైన వస్తువులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వైరా నియోజకవర్గంలోని ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరాలని కోరుతూ మరోసారి “ఆల్ ది బెస్ట్” చెప్పారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073